
సాక్షి ఒడిశా

శనివారం । 17 । ఫిబ్రవరి । 2024

I



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం శుక్రవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.5,93,907లు, బంగారం 4గ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



బంద్ ప్రశాంతం

కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ అన్ని ట్రేడ్ యూనియన్లు సంయుక్తంగా శుక్రవారం నిర్వహించిన అఖిల భారత బంద్ ప్రశాంతంగా ముగిసింది. - IIలో



ఈడీ దాడులు ముమ్మరం

రాష్ట్రంలో బీజేడీ ఎమ్మెల్యే ప్రఫుల్ల సామల్ సొంత ఇల్లు, ఇతర స్థావరాలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దాడులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. - IIలో

సార్వత్రిక ఎన్నికలకు సన్నద్ధం



సమీక్ష నిర్వహిస్తున్న సీఈసీ రాజీవ్ కుమార్ తదితరులు



సమీక్షలో పాల్గొన్న అధికారులు, రాజకీయ పక్షాల ప్రతినిధులు

- ఈసీఐ బృందం సమీక్ష సమావేశం
- రాష్ట్రంలో మూడు రోజుల పర్యటన

భువనేశ్వర్: రాష్ట్రంలో త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు సన్నాహాలు ఊపందుకుంటున్నాయి. భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) ఎనిమిది మంది సభ్యుల బృందం రాష్ట్రంలో సన్నాహాలను ప్రత్యక్షంగా సమీక్షించింది. 3 రోజుల పర్యటన పురస్కరించుకుని ఈ బృందం గురువారం రాత్రి నగరానికి చేరింది. త్వరలో జరగనున్న శాసనసభ, లోక్‌సభ ఎన్నికల సన్నద్ధతని ఈ బృందం సమీక్షించింది. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) రాజీవ్ కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం, రాబోయే జంట ఎన్నికల కోసం రాష్ట్ర సన్నద్ధతను అంచనా వేసి సమీక్షించే కసరత్తులో భాగంగా మూడు రోజులపాటు రాష్ట్రంలో పర్యటిస్తుంది. ఈ బృందంలో ఎన్నికల కమిషనర్ అరుణ్ గోయెల్, సీనియర్ డిప్యూటీ ఎన్నికల కమిషనర్ ధర్మేందర్ శర్మ, సీనియర్ డిప్యూటీ ఎన్నికల కమిషనర్ నితీష్ కుమార్ వ్యాస్ తదితరులు ఉన్నారు.

తొలి సమావేశం నిర్వహణ

సీఈసీ రాజీవ్ కుమార్, ఎన్నికల కమిషనర్ అరుణ్ గోయెల్ అధ్యక్షతన ఎన్నికల సన్నద్ధత అంచనా తొలి సమావేశం నగరంలో శుక్రవారం జరిగింది. ఈ సమావేశంలో ఒడిశా ఎన్నికల ప్రధాన అధికారి (సీఈవో) నికుంజ బిహారీ ధొలా, సీనియర్ పోలీసు, ఇతర ఎన్నికల అనుబంధ అధికారులు పాల్గొన్నారు. వచ్చే ఎన్నికలకు సంబంధించిన వివిధ అంశాలపై బృందం పలు జాతీయ, ప్రాంతీయ రాజకీయ పార్టీలతో చర్చలు జరిపింది. ఈ సందర్భంగా భారత ఎన్నికల సంఘం బృందం జిల్లా ఎన్నికల అధికారులు (డీఈఓ), పోలీసు సూపరింటెండెంట్‌లు (ఎస్పీ), ఎన్‌ఫోర్స్‌మెంట్ వర్గాలు, రాష్ట్ర నోడల్ అధికారులు మరియు ఒడిశాలోని సీనియర్ అధికారులతో సన్నద్ధతను సమీక్షిస్తుంది. మరో వైపు ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల (ఈవీఎంలు) స్థితిని, ఏకకాల జంట ఎన్నికల కోసం బూత్ స్థాయి సన్నద్ధతను ఈసీఐ బృందం సమీక్షిస్తుంది.

నిఘా వ్యవస్థకు యోచన

ఎన్నికల సమయంలో శాంతిభద్రతల పరిరక్షణ చర్యల్లో భాగంగా రాష్ట్రంలోని దాదాపు 60 శాతం బూత్‌లలో సీసీ కెమెరాలను అమర్చాలని భారత ఎన్నికల సంఘం యోచిస్తోంది. జనసాంద్రత ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో డ్రోన్ల ద్వారా నిఘాకు సైతం చర్యలు తీసుకోనున్నారు.

రాజ్యసభ ఏకగ్రీవమే..!



- మూడు స్థానాలకు మూడు నామినేషన్లు దాఖలు
- 20 వరకు ఉప సంహరణకు గడువు

భువనేశ్వర్: రాష్ట్రం నుంచి 3 రాజ్యసభ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. గడువు ముగిసే సరికి పోటీ కోసం ముగ్గురు అభ్యర్థులు మాత్రమే నామినేషన్ దస్తావేజులు దాఖలు చేశారు. ఈ లెక్కన ఒక్కో స్థానానికి ఒక్కో అభ్యర్థి పోటీ చేస్తున్నట్లు స్పష్టం అయింది. నామినేషన్ దస్తావేజుల పరిశీలన తర్వాత అర్హులైన అభ్యర్థులు పోటీ నుంచి వైదొలగకుంటే ఎన్నిక ఏకగ్రీవం అవుతుంది. ఈ పరిస్థితుల్లో రాజ్యసభ ఎన్నికల తుది ఫలితాలు ఎన్నికల సంఘం జారీ చేసిన షెడ్యూలు తేదీ కంటే ముందుగా తుది ఫలితాలు వెల్లడించేందుకు మార్గం సుగమం అవుతుంది. ఎన్నికల సంఘం ఉత్తర్వుల ప్రకారం ఈనెల 27న పోలింగ్ నిర్వహించి అదే రోజున ఫలితాలు ప్రకటించాల్సి ఉంది. రాష్ట్రంలో పోలింగ్ అవసరం లేకుండా పోటీ ఏకగ్రీవం కానుంది. ఈ క్రమంలో పోటీ నుంచి వైదొలగేందుకు తుది గడువు ముగియగానే రాజ్యసభ ఎన్నికల తుది ఫలితాలు ప్రకటించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈనెల 20వ తేదీన పోటీ ఉపసంహరణ గడువు ముగుస్తుంది. అదే రోజున తుది ఫలితాలు వెల్లడికానున్నాయి. రాజ్యసభ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఒబొనికాంత పట్నాయక్ మీడియాతో మాట్లాడుతూ పోటీకి నామినేషన్ దాఖలు చివరి తేదీ వరకు 3 మంది అభ్యర్థులు మాత్రమే దస్తావేజులు దాఖలు చేశారు. ఈ నెల 15తో నామినేషన్ల దాఖలు గడువు ముగిసింది. ఎన్నికల్లో ఒక్కో స్థానానికి ఒక్కో అభ్యర్థి బరిలో ఉన్నారు. ఫలితంగా పోటీ ఉండదు. నిబంధనల ప్రకారం ఇటువంటి పరిస్థితుల్లో ఎన్నిక అవసరం ఉండదని ఆయన అన్నారు. పోటీ నుంచి వైదొలగేందుకు ఉపసంహరణ గడువు ఈనెల 20తో ముగుస్తుంది. ఈ గడువు సరికి పోటీకి నామినేషను దస్తావేజులు దాఖలు చేసిన 3 మంది అభ్యర్థుల్లో ఎవరూ నామినేషన్‌ను ఉపసంహరించుకోకపోతే అదే రోజు విజేతలను ప్రకటించడానికి ఫలితాలను భారత ఎన్నికల సంఘానికి సిఫారసు చేస్తామని ఆయన తెలిపారు. బరాబటి కటక్ మాజీ ఎమ్మెల్యే దేబాశిష్ సామంతరాయ్, బిజూ యువ జనతా దళ్ (బీవైజేడీ) ఉపాధ్యక్షుడు సుభాషిష్ ఖుంటియా 2 రాజ్యసభ స్థానాలకు అధికార బీజేడీ తరఫున తమ నామినేషన్ దాఖలు చేశారు. భారతీయ జనతా పార్టీ అభ్యర్థిగా రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ గురువారం తన నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. ఎన్నికల్లో వైష్ణవ్‌కు మద్దతు ఇస్తామని బీజేడీ గతంలోనే ప్రకటించిన విషయం తెలిసిందే.

న్యూస్‌రీల్

అయోధ్యకు త్వరలో రైలు సౌకర్యం



భువనేశ్వర్: రాష్ట్రంలో రైలు సేవలు మరింత విస్తరించనున్నాయి. పూరీ నుంచి అయోధ్య, కోణార్క్ ప్రాంతాలకు ప్రత్యేక రైలు సౌకర్యాలు త్వరలో అందుబాటులోకి రానున్నాయి. పూరీ నుంచి ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్యకు ప్రత్యక్ష రైలు సేవలు, పూరీ నుంచి కోణార్క్‌కు రైలు మార్గాన్ని త్వరలో ప్రారంభించాలని రైల్వే మంత్రిత్వ శాఖ నిర్ణయించింది. ఈ విషయాన్ని రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ పూరీలో మీడియాతో మాట్లాడుతూ శుక్రవారం వెల్లడించారు. రాష్ట్రంలో రైల్వే నెట్‌వర్క్‌ను వేగంగా అభివృద్ధి చేయడంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆసక్తిగా ఉన్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో కొనసాగుతున్న ప్రాజెక్టులను క్రమం తప్పకుండా ఆయన పర్యవేక్షిస్తున్నారన్నారు. ప్రధానమంత్రి చొరవలో భాగంగా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తూ రెండు ప్రధాన ప్రాజెక్టులపై నిర్ణయం తీసుకున్నారు. దీనికి సంబంధించి ఇప్పటికే పనులు ప్రారంభించారు. అయోధ్యలో ట్రాక్‌ల డబ్లింగ్‌తో పాటు రైల్వే సేవల అభివృద్ధికి చాలా పనులు జరుగుతున్నాయి. అవసరమైన అన్ని సహాయక పనులు త్వరగా పూర్తవుతాయన్నారు. ఈ ఏడాది జూలై, ఆగస్టులో అయోధ్యకు రైళ్ల నడవడం ప్రారంభమవుతుందని అశ్విని వైష్ణవ్ ఆశాభావం వ్యక్తం చేశారు.

'అవినీతిపై దర్యాప్తు చేయాలి'



ఫిర్యాదు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

పర్లాకిమిడి: స్థానిక మున్సిపల్ కార్యాలయం గోదామ్‌లో గత ఆదివారం రాత్రి మంటలు చెలరేగి విలువైన ఫైల్స్ కాలి బూడిదైన విషయం తెలిసిందే. అయితే ఈ అగ్నిప్రమాదం ఉద్దేశపూర్వకంగా జరిగిందని, దీనిపై లోతైన దర్యాప్తు చేయాలని కోరుతూ కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం రాత్రి కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు బసంత పండా, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు సూర్య నారాయణ పాత్రో తదితరులు పర్లాకిమిడి ఆదర్శ పోలీసుస్టేషన్‌లో ఐఐసీ ప్రశాంత భూపతికి ఫిర్యాదు చేశారు. పర్లాకిమిడి పురపాలక సంఘంలో అవినీతి జరుగుతోందని, ఈ విషయంపై గతేడాది డిసెంబరులోనే ఫిర్యాదు చేశామని తెలియజేశారు. ఘటనపై అధికారులు పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలని కోరారు.

బీజేడీలోకి రాకేష్ సింగ్



ఎమ్మెల్యే ప్రణబ్ ప్రకాష్‌తో రాకేష్ సింగ్

మల్కన్‌గిరి: జిల్లాలోని బలిమెల ఎన్ఏసీలో పనిచేసిన బీజేపీ నాయకుడు రాకేష్ సింగ్ బీజేడీలో చేశారు. భువనేశ్వర్‌లోని బీజేడీ కార్యాలయంలో ఆ పార్టీ జాజ్‌పూర్ ఎమ్మెల్యే ప్రణబ్ ప్రకాష్ దాస్ సమక్షంలో శంఖతీర్థం శుక్రవారం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో బీజేడీ చేస్తున్న అభివృద్ధి పనులకు ఆకర్షితమై పార్టీలో చేరుతున్నట్లు ప్రకటించారు. ప్రస్తుతం రాష్ట్రంలోని ప్రజలకు అన్ని సౌకర్యాలు అందుతున్నాయన్నారు. పార్టీ అభివృద్ధికి అందరితో సమష్టిగా పనిచేస్తానని తెలియజేశారు.

దివ్యాంగులకు ఉపకరణాల శిబిరం



ఉపకరణాలు అందుకున్న దివ్యాంగులతో అధికారులు

జయపురం: సబ్ డివిజన్ కుంద్ర సమితి కార్యాలయంలో శుక్రవారం దివ్యాంగుల ఉపకరణాల శిబిరం నిర్వహించారు. దీనిలో భాగంగా కొరాపుట్ జిల్లా కేంద్ర సామాజిక సురక్షా విభాగం, ఎస్.బి.నిరతార కటక్ వారు జనవరి 4వ తేదీన సంయుక్తంగా నిర్వహించిన భీమ భొయి దివ్యాంగుల సహాయ శిబిరంలో గుర్తించబడిన దివ్యాంగులకు పరికరాలు అందజేశారు. కార్యక్రమంలో కుంద్ర సమితి వైస్ చైర్మన్ తరుణీసేన్ బిసాయి, అదనపు బీడీవో రామ ప్రసాద్ దొర, బీఎస్ఎస్‌వో బలిరాం భొత్ర, బీజేడీ బ్లాక్ అధ్యక్షుడు బృందావన్ మల్లిక్, కొరాపుట్ జిల్లా పరిషత్ జోన్-2 సభ్యుడు కనకలత పెంటియ, ఆత్మ అధ్యక్షులు కామ ఆచార్య, రమాకాంత మిశ్ర, టున నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మహంగా హత్య కేసులో ట్విస్ట్

- విచారణ నుంచి తప్పుకున్న న్యాయమూర్తి

భువనేశ్వర్: రాష్ట్రంలో తీవ్ర సంచలనం సృష్టించిన మహంగా జంట హత్యల కేసు విచారణ నుంచి హైకోర్టు న్యాయమూర్తి తప్పుకున్నారు. దిగువ కోర్టు ఆదేశాలను సవాల్ చేస్తూ బిజూ జనతా దళ్ ఎమ్మెల్యే, మాజీ న్యాయశాఖ మంత్రి ప్రతాప్ జెనా రాష్ట్ర హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ నుంచి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.పి.రౌత్రాయ్ తప్పుకున్నారు. దీంతో ఈ కేసు విచారణను ఇప్పుడు హైకోర్టులో మరో ధర్మాసనం నిర్వహించనుంది. జెనా పిటిషన్‌ను విచారించే ధర్మాసనాన్ని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి త్వరలో నిర్ణయించనున్నారు.

కొనసాగుతున్న మధ్యంతర ఉపశమనం

ఇదిలా ఉండగా ఎమ్మెల్యే జెనాకు మధ్యంతర ఉపశమనం అమలు కొనసాగుతోంది. మహంగా జంట హత్యల కేసులో ఆయనపై బలవంతపు చర్యల నుంచి మధ్యంతర రక్షణను హైకోర్టు పొడిగించింది. ప్రతాప్ జెనా తన పిటిషన్‌లో మహంగా జంట హత్యల కేసులో నిందితుడిగా తనపై నేరాలను పరిగణలోకి తీసుకున్న సలేపూర్ ప్రథమ శ్రేణి జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ (జేఎంఎఫ్‌సీ) కోర్టు ఆదేశాలను సవాలు చేశారు. గతేడాది అక్టోబర్ 31న వ్యక్తిగతంగా హాజరుకావాలని ప్రతాప్ జెనాకు జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ సమన్లు జారీ చేశారు. అయితే తన న్యాయవాది ద్వారా హాజరైన ప్రతాప్ జెనా తన అనారోగ్యం కారణంగా వ్యక్తిగతంగా హాజరు కాలేకపోతున్నానని పేర్కొంటూ పిటిషన్ దాఖలు చేశారు. స్థానిక క్యాపిటల్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడని, అక్కడ చికిత్స చేస్తున్న డాక్టర్ తనకు ఒక నెల రోజులపాటు బెడ్ రెస్ట్ ఇచ్చారని పిటిషన్‌లో పేర్కొన్నారు.

వ్యక్తిగత హాజరుకు మినహాయింపు

అనారోగ్యం కారణంగా ఐపీసీ సెక్షన్ 205 ప్రకారం వ్యక్తిగత హాజరు నుంచి తనకు మినహాయింపు ఇవ్వాలని ఆయన కోర్టును కోరారు. 2021 జనవరి 2న మహంగా మండల అధ్యక్షుడుగా ఉన్న భారతీయ జనతా పార్టీ నాయకుడు కులమణి బొరాల్ (75), అతని సహచరుడు దిబ్యసింగ్ బొరాల్ (80) మోటార్ బైక్‌పై ఇంటికి తిరిగి వస్తుండగా మహంగా తహసీల్ జంకోటి గ్రామ సమీపంలో గుర్తు తెలియని దుండగులు నరికి చంపారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు ప్రఫుల్ల బిస్వాల్ కూడా కటక్ జిల్లా టంగి గోవింద్‌పూర్ సమీపంలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు.

దాతలకు ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు

భువనేశ్వర్: అవయవాలను దానం చేయడం ద్వారా ఇతరుల ప్రాణాలను కాపాడే వారి త్యాగం, ధైర్యానికి గుర్తింపుగా వారి అంత్యక్రియలను పూర్తి ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహించనున్నట్లు సీఎం నవీన్ పట్నాయక్ ప్రకటించారు. దీనివల్ల అవయవ దానం రంగంలో విస్తృతంగా అవగాహన కల్పిస్తామని, అవయవ దానం చేయడం ద్వారా ఇతరుల ప్రాణాలను కాపాడేందుకు సమాజానికి స్ఫూర్తినిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అవయవ దానం గొప్ప వరం. మెదడు వైఫల్యంతో ప్రాణాపాయ పరిస్థితుల్లో అవయవ దానాన్ని అనుమతించడానికి ధైర్యమైన నిర్ణయం తీసుకోవడం ద్వారా ఇతరుల ప్రాణాలను రక్షించడంలో బంధువులు కీలక పాత్ర పోషిస్తారు. అవయవ మార్పిడి ప్రక్రియను సులభతరం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం 2019 సంవత్సరంలో స్టేట్ ఆర్గాన్ అండ్ టిష్యూస్ ట్రాన్స్‌ప్లాంట్ ఆర్గనైజేషన్ (ఎస్ఓటీటీఓ) ఏర్పాటు చేసింది. అవయవ దానాన్ని ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం 2020 సంవత్సరంలో 'సూరజ్ పురస్కార్'ను ప్రారంభించింది. గంజాం జిల్లా భంజనగర్ ప్రాంతానికి చెందిన సూరజ్ పేరిట ఈ అవార్డును ప్రారంభించడం గమనార్హం. రోడ్డు ప్రమాదంలో సూరజ్ తీవ్రంగా గాయపడి బ్రెయిన్ డెడ్ అయ్యాడు. సూరజ్ శరీరం నుంచి కీలక అవయవాలను దానం చేయాలని అతని కుటుంబం నిర్ణయించింది. ఈ కీలక అవయవాలు 6 మంది ప్రాణాలను కాపాడాయి. అవయవ దానం చేసిన వారి బంధువులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.5 లక్షలు అందజేస్తారు. దీనితో పాటు ప్రతి సంవత్సరం ఆగస్టు 13న ప్రపంచ అవయవ దాన దినోత్సవం సందర్భంగా అవయవ దాతల బంధువులను ముఖ్యమంత్రి సత్కరిస్తారు.

భారీగా గంజాయి పట్టివేత



బరంపురం: పట్టుబడిన గంజాయిని చూపిస్తున్న ఎక్సైజ్ అధికారులు

బరంపురం: కొంధమాల్, గజపతి, గంజాం జిల్లాల సరిహద్దుల్లో గంజాయి మాఫియా చెలరేగుతోంది. ఏఎస్పీ సురేంద్ర కుమార్ పాత్రో తెలిపిన వివరాల మేరకు.. శుక్రవారం ఉదయం కొంధమాల్ జిల్లా బల్లిగుడా పోలీసులు కళింగా ఘాటీపై అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్న టాటా వ్యాన్, రెండు ద్విచక్ర వాహనాలపై దాడులు చేశారు. దీనిలో భాగంగా సుమారు 335 కిలోల గంజాయి సీజ్ చేశారు. పోలీసులు వస్తున్నట్లు గమనించిన 10 మంది నిందితులు పరారైనట్లు వెల్లడించారు. అదేవిధంగా కొంధమాల్-గంజాం జిల్లా సరిహద్దు తప్తపాణి ఘాటీపై బరంపురం ఎక్సైజ్ అధికారుల బృందం కారులో తరలిస్తున్న 150 కిలోల గంజాయి సీజ్ చేశారు. దీనిలో భాగంగా ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు వెల్లడించారు.



జయపురం: అరెస్టైనవారిని చూపిస్తున్న బొయిపరిగుడ పోలీసులు



బరంపురం: బల్లిగుడ పోలీసులు సీజ్ చేసిన గంజాయి, ద్విచక్ర వాహనాలు

జయపురం: సబ్ డివిజన్ బొయిపరిగుడ సమితి మంత్రిఅంబ గ్రామ సమీపంలో ఒక కారులో గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. బొయిపరిగుడ పోలీసు అధికారి దీపాంజలి ప్రధాన్ నేతృత్వంలో ఏఎస్ఐ డి.బారిక్, ఇతర పోలీసులు శుక్రవారం మధ్యాహ్నం వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మల్కన్‌గిరి వైపు నుంచి వస్తున్న ఒక కారుని తనిఖీ చేయగా గంజాయి పట్టుబడింది. గంజాయిని తూయించగా అది 29 కేజీల 600 గ్రాములు ఉన్నట్లు వెల్లడించారు. పట్టుబడిన వారు ధర్మఘడ్ జిల్లా కంగారి గ్రామానికి చెందిన బులు మఝి, నవరంగపూర్ జిల్లా తెంతులిగుమ్మ పోలీసుస్టేషన్ పరిధి డొంగసిల్ గ్రామానికి చెందిన హరేంద్ర హరిజన్‌లుగా వెల్లడించారు. వీరు గంజాయిని నవరంగపూర్ మీదుగా ధర్మఘడ్‌కు తీసుకెళ్తున్నట్లు తెలియజేశారు.

రాయగడలో దొంగల బీభత్సం



దొంగతనం జరిగిన షాపు



దొంగతనం జరిగిన మెడికల్ షాపు

రాయగడ: పట్టణంలో రోజురోజుకూ దొంగల బెడద ఎక్కువవుతోంది. గురువారం రాత్రి ఒక్కరోజే వరుసగా నాలుగు దొంగతనాలు చోటుచేసుకోవడంతో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. స్థానిక పాతగేటు వద్దనున్న కాంప్లెక్స్‌లో వేంకటేశ్వర మెడికల్ షాపులో షట్టరు విరిచి గుర్తు తెలియని దుండగులు రూ.25 వేల నగదు దొంగలించినట్లు మెడికల్ షాపు యజమాని సూర్యారావు తెలియజేశారు. అదేవిధంగా మెడ్‌ప్లస్ షాపులో, అషార్‌పూర్ ఎంటర్‌ప్రైజెస్, రాయల్ శానిటేషన్ దుకాణాల్లో దొంగతనాలు జరిగినట్లు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటన స్థలాలకు చేరుకున్న పోలీసులు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.

4కు చేరిన మృతుల సంఖ్య

భువనేశ్వర్: గత వారం బొలంగీర్ జిల్లా బెల్లొపాడా ప్రాంతంలో సంభవించిన గ్యాస్ సిలిండర్ పేలుడు ఘటనలో మృతుల సంఖ్య పెరిగింది. శుక్రవారం మరణించిన వ్యక్తితో సమగ్ర మృతుల సంఖ్య 4కి చేరింది. కాలిన గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరొకరు మరణించారు. ఈనెల 10న జిల్లాలోని బెల్లొపాడా ప్రాంతం కటుగాంవ్ ఉప్పారొపాడా గ్రామంలో ఒకరి ఇంట్లో గ్యాస్ సిలిండర్ పేలడంతో ఒక కుటుంబంలోని 6 మంది సభ్యులు మంటల్లో తీవ్రంగా గాయపడ్డారు. 6 మంది కుటుంబీకులు ఇంటి లోపల టీవీ చూస్తుండగా వంటగదిలోని సిలిండర్‌కు మంటలు అంటుకుని పేలిపోయింది. వీరంతా తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానికులు రక్షించి పరిస్థితి విషమంగా ఉండడంతో కంటాబంజి కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ)కి తరలించారు. అనంతరం వారిని రౌర్కెలాలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. వారిలో ఒకరు ఈనెల 12న మరణించగా, మరో ఇద్దరు గురువారం మరణించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మరో వ్యక్తి మృతి చెందడంతో ఈ ఘటనలో మృతుల సంఖ్య 4కు చేరింది.

'హిట్ అండ్ రన్ చట్టాన్ని ఉపసంహరించుకోవాలి'



మాట్లాడుతున్న సునీల్ ఖర్

రాయగడ: కేంద్ర ప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చిన నూతన హిట్ అండ్ రన్ చట్టాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని జిల్లా మోటార్ ఉద్యోగుల సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు స్థానిక కపిలాస్ కూడలి వద్ద ఆందోళన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు, న్యాయవాది సునీల్ కుమార్ ఖర్ మాట్లాడుతూ.. వాహనాల వలన ప్రమాదాలు చోటుచేసుకుంటే వాహన చోదకుడికి 10 ఏళ్ల జైలు శిక్ష, రూ.7 లక్షల జరిమానా విధించేందుకు కొత్త చట్టం తీసుకొచ్చారన్నారు. అయితే ప్రమాదాలు కేవలం చోదకుడి తప్పిదం వలనే జరగడం లేదని, పాడైపోయిన రహదారులు, వాతావరణ పరిస్థితులు సైతం కొన్నిసార్లు ప్రభావితం చేస్తాయని తెలియజేశారు. ఈ చట్టం రద్దు చేయకపోతే మోటారు ఉద్యోగుల కుటుంబాలు ఛిద్రమవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం సభ్యులంతా కలిసి కలెక్టర్ కార్యాలయానికి చేరుకుని కేంద్ర హోం మంత్రి అమిత్ షా పేరిట రాసిన వినతిపత్రాన్ని కలెక్టర్ మనోజ్ సత్యవాన్ మహాజన్‌కు అందించారు.

'పోడు వ్యవసాయంతో అడవులు నాశనం'



జ్యోతి ప్రజ్వలనతో సదస్సు ప్రారంభిస్తున్న డీఎఫ్‌వో సాహెబ్



సదస్సులో పాల్గొన్న అటవీ శాఖ సిబ్బంది తదితరులు


రాయగడ: పోడు వ్యవసాయంతో అడవులు నాశనమవుతున్నాయని డీఎఫ్‌వో సచిన్ అన్నా సాహెబ్ అన్నారు. స్థానిక రైతుల కాలనీలోని ఫారెస్ట్ పార్క్‌లో రాయగడ డివిజన్ అటవీ శాఖ ఆధ్వర్యంలో అడవుల సంరక్షణపై అవగాహన సదస్సు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆదివాసీ ప్రాంతాల్లో ప్రజల అమాయకత్వం కారణంగా పోడు వ్యవసాయం పేరుతో అడవులను తగలబెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అడవులు లేకపోతే పర్యావరణం దెబ్బతింటుందని, విలువైన వృక్ష సంపద అంతరిస్తుందని, వన్య ప్రాణులను కోల్పోయే అవకాశం ఉందని హెచ్చరించారు. అందువలన ఇప్పటికైనా పోడు వ్యవసాయాన్ని వీడాలని కోరారు. దీనికి సంబంధించి అటవీ శాఖ సిబ్బంది ప్రజల్లో చైతన్యం కల్పించాలని హితవు పలికారు. ఇదిలా ఉండగా మరి కొన్ని ప్రాంతాల్లో కృత్రిమంగా అడవులు అంతరిస్తున్నాయని వివరించారు. ఏది ఏమైనప్పటికీ సమైఖ్యంగా అడవులను సంరక్షించే బాధ్యత చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో బీడీవో అమూల్య కుమార్ సాహు, ఏసీఎఫ్‌వో అశోక్ కుమార్ ప్రధాన్, డాక్టర్ పీకే సుబుద్ధి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

20న యువతకు ఉపన్యాస పోటీలు

పార్వతీపురం: యువత కు ఉపన్యాస పోటీలను ఈ నెల 20న నిర్వహి స్తామని నెహ్రూ యువ కేంద్ర జిల్లా యువజన అధికారి కె.వెంకట్ ఉజ్వల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడలు మంత్రిత్వ శాఖకు చెందిన నెహ్రూ యువకేంద్ర సంఘటన్ ఆదేశాల మేరకు వీటిని నిర్వహిస్తామన్నారు. న్యూఢిల్లీ పార్లమెంట్ భవనంలో జరిగే జాతీయ యూత్ ఫెస్టివల్–2024 కార్యక్రమంలో భాగంగా ప్రసంగించే అవకాశం కోసం ఉపన్యాస పోటీలు నిర్వహి స్తామని తెలిపారు. 18 నుంచి 25 ఏళ్ల వయస్సు ఉన్న యువతీ యువకులు పోటీల్లో పాల్గొనాలన్నారు. వికసిత్ భారత్, భారత్ మేకింగ్ ఇండియా, ఏ గ్లోబల్ లీడర్, ఎంపవరింగ్ ద ఫ్యూచర్ అనే అంశాల పై ఉపన్యాస పోటీలు ఉంటాయన్నారు. జిల్లా స్థాయి పోటీలు ఈ నెల 20న ఉదయం 10 గంటలకు వర్చువల్ మోడ్‌లో జరుగుతాయన్నారు. యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు సెల్: 70364852 78 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

శివలింగానికి భానుడి కిరణ స్పర్శ



శివలింగాన్ని తాకిన సూర్యకిరణాలు

రాజాం సిటీ: రథసప్తమి పర్వదినాన పట్టణ పరిధి సంతమార్కెట్ వద్ద ఉన్న కల్యాణగౌరీ మల్లికార్జునస్వామి దేవాలయంలో శివలింగాన్ని భానుడి కిరణాలు స్పర్శించాయి. శుక్రవారం ఉదయం 7 గంటల సమయంలో కనిపించిన ఈ అద్భుత దృశ్యాన్ని చూసిన భక్తులు పులకించిపోయారు. స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు.

19న రాజాం ఆర్టీసీ కాంప్లెక్స్ ప్రారంభోత్సవం

రాజాం: రాజాంలో రూ.1.80కోట్ల వ్యయంతో ప్రభుత్వం కొత్తగా నిర్మించిన ఆర్టీసీ కాంప్లెక్స్ ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయి. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ కాంప్లెక్స్ నూతన సముదాయాన్ని ఈ నెల 19న ప్రారంభించనున్నారు. ఈ మేరకు ఇన్‌గేట్, ఔట్‌గేట్ రోడ్లు చదును చేయడంతో పాటు లైనింగ్ పనులను అధికారులు పూర్తిచేస్తున్నారు.

శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యం



స్థానిక పాఠశాలలో ఆరో తరగతి విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలు పరిశీలిస్తున్న డీఈఓ ప్రేమకుమార్

రామభద్రపురం: పదో తరగతి పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యమని డీఈఓ ప్రేమకుమార్ అన్నారు. రామభద్రపురం ఉన్నత పాఠశాలను శుక్రవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. అన్ని తరగతి గదులకు వెళ్లి విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను పరీక్షించారు. జగనన్న గోరుముద్ద అమలు, ఉపాధ్యాయుల బోధనపై ఆరా తీశారు. చక్కగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని విద్యార్థులకు సూచించారు. రామభద్రపురం పాఠశాలకు జిల్లాలో ఒక చరిత్ర ఉందని, ఇక్కడ చదువుకున్న విద్యార్థులు అధికమంది ఉన్నత స్థాయిలో స్థిరపడ్డారన్నారు. జిల్లాలో ఈ ఏడాది 23,910 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయనున్నారని, వీరికోసం 129 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. శతశాతం ఉత్తీర్ణత కోసం సెల్ఫ్ టెస్టులు, గ్రాండ్ టెస్టులు నిర్వహిస్తున్నామని చెప్పారు.



పర్లాకిమిడి: నగరంలో అఖిల భారత ట్రేడ్ యూనియన్ల ర్యాలీ



పర్లాకిమిడి: కొత్త బస్టాండ్ నుంచి ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



మల్కన్‌గిరి: నినాదాలు చేస్తున్న సీపీఐ నేతలు

బంద్ ప్రశాంతం

కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ అన్ని ట్రేడ్ యూనియన్లు సంయుక్తంగా శుక్రవారం నిర్వహించిన అఖిల భారత బంద్ ప్రశాంతంగా ముగిసింది. వివిధ ప్రాంతాలు, జాతీయ రహదారులపై కేంద్రప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నల్ల చట్టాలతో కార్మిక హక్కులను కాల రాస్తున్నారని దుయ్యబట్టారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేస్తున్నారని మండిపడ్డారు. నిరుద్యోగ సమస్య విలయ తాండవం చేస్తోందని, ధరల పెరుగుదలతో సామాన్యుడు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తమ విధానాలు మార్చుకోకపోతే ప్రజా ప్రతి ఘటన తప్పదని హెచ్చరించారు.

– సాక్షి నెట్‌వర్క్



రాయగడ: రామనగరులో రోడ్డు మధ్య కర్రలు కట్టి రాకపోకల నివారణ



పర్లాకిమిడి: బస్టాండ్‌లో నిలిచిపోయిన ప్రైవేటు బస్సులు



జయపురం: ప్రధాన కూడలి వద్ద ఆందోళన జరుపుతున్న కార్మిక నేతలు



రాయగడ: తుంబిగుడ కూడలిలో ట్రేడ్ యూనియన్ నాయకుల నిరసన



రాయగడ: తిరుపతి గొమాంగో ఆధ్వర్యంలో గుణుపూర్‌లో నిరసన



మల్కన్‌గిరి: ర్యాలీలో పాల్గొన్న జిల్లా కాంగ్రెస్ పార్టీ నేతలు

ఈడీ దాడులు ముమ్మరం

- ఎమ్మెల్యే సామల్ ఇల్లు, ఇతర ఆస్తులపై దాడులు
- రూ.9 లక్షల నగదు స్వాధీనం
- విలాసవంతమైన కారు జప్తు

భువనేశ్వర్: రాష్ట్రంలో బీజేడీ ఎమ్మెల్యే ప్రఫుల్ల సామల్ సొంత ఇల్లు, ఇతర స్థావరాలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దాడులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. మనీలాండరింగ్ ఆరోపణలపై ఈ దాడుల చేపట్టినట్లు సమాచారం. దీనిలో భాగంగా స్థానిక పల్లాస్‌పల్లి ప్రాంతంలోని ఎమ్మెల్యే కుమారుడు ప్రయాస్ కాంతి సామల్ ఇంట్లో సైతం ఈడీ దాడులు చేపట్టి టయోటా ఫార్చ్యూనర్ ఎస్‌యూవీ కారు, రూ.9 లక్షల నగదును స్వాధీనం చేసుకుంది. అయితే ఈ వాహనం నిర్మాణ సంస్థ త్రిష్ణ స్కైస్క్రాపర్ లిమిటెడ్ పేరుతో రిజిస్టర్ చేయబడిందని శుక్రవారం నివేదికలు తెలిపాయి.



ఈడీ అధికారులు జప్తు చేసిన కారు

రూ.20 కోట్ల అవకతవకలపై ఆరోపణలు

ప్రఫుల్ల సామల్ భద్రక్ జిల్లా భండారిపొఖొరి నియోజకవర్గం బీజేడీ ఎమ్మెల్యే. బొరొపొదాలో భద్రక్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (బీఐఈటీ)లో రూ.20 కోట్ల మేర ఆర్థిక అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై కేంద్ర ఏజెన్సీ అధికారులు గురువారం భద్రక్‌లోని ఆరు చోట్ల, భువనేశ్వర్‌లో నాలుగు ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. ఎమ్మెల్యే కుమారుడు ప్రయాస కాంతి సామల్ బీఐఈటీ అధ్యక్షుడు. విద్యార్థుల ఫీజులను స్వాహా చేసి ఆ డబ్బుతో భువనేశ్వర్ తదితర ప్రాంతాల్లో కోట్లాది రూపాయల విలువైన ఆస్తులు కొనుగోలు చేశారనే ఆరోపణలున్నాయి. భద్రక్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ మాజీ ప్రిన్సిపాల్ ఇంటిపై సైతం ఈడీ దాడులు నిర్వహించింది. 2000 సంవత్సరంలో భద్రక్ జిల్లా భండారిపొఖొరి మండలం బొరొపొదా గ్రామ పంచాయతీ శ్మశానవాటిక కోసం నిర్ధారించిన 5.12 ఎకరాల సువిశాల స్థలాన్ని ఆక్రమణ వ్యవహారంలో ఆయనకు వ్యతిరేకంగా ఆరోపణ. కళాశాల మాజీ ప్రిన్సిపాల్, ప్రయాస్ కాంతి సామల్‌తో సంబంధాలు ఉన్న బిల్డర్ ఇళ్లలో కూడా ఈడీ సోదాలు జరిగాయి. బిల్డర్‌కు వ్యతిరేకంగా నేరపూరిత పూర్వాపరాలు ఉన్నాయని, అతనిపై చీటింగ్ ఫిర్యాదులు కూడా నమోదై ఉన్నట్లు సమాచారం.

కేసు నమోదుతో దాడులు

కోట్లాది రూపాయల మనీలాండరింగ్ కేసులో ఎమ్మెల్యే ప్రఫుల్ల సామల్, అతని కుమారుడు ప్రయాస్ కాంతి సామల్ ప్రమేయం ఉందనే ఆరోపణతో జిల్లా పోలీసులు ఇటీవల ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. దీని ఆధారంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు నిర్వహించినట్లు తెలిసింది. అయితే దాడులు దురుద్దేశపూరిత చర్య తప్ప మరొకటి కాదని ఎమ్మెల్యే ఆరోపించారు. ప్రఫుల్ల సామల్ అనారోగ్యంతో ఉన్నారని, నిరంతర చికిత్స అవసరమైనా ఈడీ అధికారులు వేధిస్తున్నారని ప్రఫుల్ల సామల్ తరఫు న్యాయవాది తెలిపారు.

ఉపాధ్యక్షుడిగా రూపేష్ పాణిగ్రాహి



రూపేష్ పాణిగ్రాహి

పర్లాకిమిడి: హైటెక్ మెడికల్ విద్యాసంస్థల ఎండీ రూపేష్ పాణిగ్రాహిని బీజేడీ రాష్ట్ర యువ జనతాదళ్ ఉపాధ్యక్షుడిగా నియమించినట్లు ఆ పార్టీ ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రణబ్‌ప్రకాష్‌దాస్ శుక్రవారం ప్రకటించారు. ఆయనతో పాటు రాష్ట్ర బీజేడీ కార్యదర్శి అలోక్‌కుమార్ పాణిగ్రాహి, ప్రియదర్శి ప్రత్యూష్ రథ్‌లు రైరాకోల్ అసెంబ్లీ పరిశీలకులుగా నియమితులయ్యారు. ప్రముఖ విద్యాసంస్థల చైర్మన్ డా.తిరుపతి పాణిగ్రాహి తనయుడు రూపేష్ పాణిగ్రాహి గత కొన్ని నెలలుగా విస్తృతంగా గజపతి జిల్లాలో బీజేడీ గెలుపు కోసం కృషిచేస్తున్నారు. ఆయన నియామకంపై ఎంపీ చంద్రశేఖర సాహు, జిల్లా పరిషత్ అధ్యక్షుడు గవర తిరుపతిరావు, బీజేడీ పార్టీ రాష్ట్ర సాధారణ కార్యదర్శి ప్రదీప్ కుమార్ నాయక్, జిల్లా సహకార, మార్కెటింగ్ సొసైటీ అధ్యక్షుడు ఎస్.గజపతిరావు, అర్బన్ కో–ఆపరేటివ్ బ్యాంకు అధ్యక్షుడు ఎన్ని గోపి, పర్లాకిమిడి పురపాలక సంఘం చైర్మన్ నిర్మలా శెఠి, జిల్లా బీజేడీ అధ్యక్షుడు జగబంధు దాస్, బీజేడీ రాష్ట్ర సాధారణ కార్యదర్శి బసంత్ దాస్, లక్ష్మీకాంత పోరిచ్చా, కాశీనగర్ ఎన్ఏసీ చైర్మన్ ఎం.సుధారాణి, కాశీనగర్ బీజేడీ బ్లాక్ అధ్యక్షుడు రొక్కం సతీష్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

వృద్ధ దంపతుల ఆత్మహత్య

పర్లాకిమిడి: స్థానిక కెవుటి వీధిలో నివసిస్తున్న ఇద్దరు వృద్ధ దంపతులు నవీన్ ఆచార్య(63), భార్య బసంతీ ఆచార్య (55)లు పురుగు మందుతాగి స్వగృహంలో ఆత్మహత్య చేసుకున్నారు. ఈ విషయం తెలుసుకుని ఆదర్శ పోలీసుస్టేషన్ ఐఐసీ ప్రశాంత్ భూపతి సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాలను ప్రభుత్వ హెడ్‌క్వార్టర్ ఆస్పత్రికి పోస్టుమర్టం నిమిత్తం శుక్రవారం తరలించారు. మృతుల ఇద్దరు కుమారుల్లో ఒకరు బరంపురం, మరొకరు పర్లాకిమిడిలో వేర్వేరుగా నివాసముంటున్నారు. బరంపురం నుంచి వచ్చిన పెద్ద కుమారుడు అరుణ్ కుమార్ ఆచార్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



వివరాలు వెల్లడిస్తున్న ఐఐసీ ప్రశాంత్ భూపతి

జలాశయంలో ఇద్దరు చిన్నారులు మృతి

మల్కన్‌గిరి: జిల్లాలోని కోరుకొండ సమితి నక్కమామిడి పంచాయతీ కెందుగూడ గ్రామంలో శుక్రవారం ఉదయం స్నానానికి వెళ్లిన ఇద్దరు చిన్నారులు చిత్రకొండ జలాశయంలో మునిగి మృతి చెందారు. వివరాల్లోకి వెళ్తే.. కెందుగూడ గ్రామానికి చెందిన సోనియా ముదిలి కుమార్తె సావిత్రీ ముదిలి(8), ధనూ కంగాడియా కుమార్తె దబిలి కంగాడియా (7)లు తోటి చిన్నారులతో కలిసి ఆడుకున్నారు. అనంతరం ఇద్దరు చిన్నారులు జలాశయంలో స్నానానికి దిగారు. ఆ సమయంలో మిగతా చిన్నారులు ఇంటికి వెళ్లిపోయారు. కాగా నీటిలో దిగిన చిన్నారులు ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు అన్నిచోట్లా వెతికారు. అనంతరం తోటి చిన్నారులను అడగగా వారు నీటిలో స్నానానికి దిగినట్లు తెలియజేశారు. దీంతో జలాశయం పరిసరాల్లో గాలించగా చిన్నారుల చెప్పులు కనిపించడంతో వెంటనే చిత్రకొండ ఐఐసీ ముకుందో మేల్కకు సమాచారం ఇచ్చారు. ఆయన వెంటనే బలిమెల అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో, అగ్నిమాపక సిబ్బంది సాయంత్రం గాలించి మృతదేహాలను బయటకు తీశారు. చిన్నారుల మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. పోస్టుమార్టం అనంతరం శనివారం ఉదయం మృతదేహాలను తల్లిదండ్రులకు అప్పగిస్తామని పోలీసులు వెల్లడించారు.



జలాశయంలో గాలిస్తున్న అగ్నిమాపక సిబ్బంది



చిన్నారుల మృతదేహాలు

రామఫలాల సీజన్ ఆరంభం

- ఆశాజనకంగా దిగుబడి
- గుత్తులు లెక్కన విక్రయం
- ఒక్కోగుత్తిలో 20 నుంచి 40 వరకు ఫలాలు
- సైజును బట్టి రూ.120 నుంచి 150 మధ్య విక్రయం

సీతంపేట: సీతంపేట ఏజెన్సీలో రామఫలాల సీజన్ ఆరంభమైంది. కొండల్లో సేకరించిన రామఫలాలను గిరిజనులు గుత్తుల లెక్కన వారపు సంతలు, మార్కెట్లలో విక్రయిస్తున్నారు. ఒక్కో గుత్తిలో 20 నుంచి 40 వరకు రామఫలాలుండగా రూ.120 నుంచి రూ.150 వరకు ధర పలుకుతున్నాయి. వచ్చే నెలాఖరు వరకు ఫలాల సీజన్ ఉంటుంది. రామానగరం, దేవనాపురం గూడలు, అక్కన్నగూడ, రాజన్నగూడ, మొగదార, కారెం కొత్తగూడ తదితర ప్రాంతాల గిరిజన రైతులు సోమవారం జరిగే సీతంపేట సంతలోను, కుశిమి, కోడిశ, శంభాం ప్రాంత వాసులు కుశిమిసంతలో (శనివారం)ను, మర్రిపాడు, పూతికవలస, చిన్నబగ్గ, కీసరజోడు పంచాయతీ వాసులు బుధవారం మర్రిపాడులో జరిగే సంతలో విక్రయిస్తున్నారు. గిరిజనుల వద్ద కొనుగోలుచేసిన ఒక్కో గుత్తి రామఫలాలు మైదాన ప్రాంతాల్లో రూ.400ల వరకు విక్రయిస్తామని వ్యాపారులు చెబుతున్నారు. పెట్టుబడులు లేకుండా, కొండపోడులో లభించే రామఫలాలతో మంచి ఆదాయం సమకూరుతుండడంతో గిరిజన రైతులు సంతోషపడుతున్నారు.



రామఫలాలు లోడ్ ఎక్కిస్తున్న వ్యాపారులు



విక్రయానికి మార్కెట్‌కు తీసుకువచ్చిన గిరిజనుడు

సేకరణ కష్టమే..



కొండపోడు వ్యవసాయంలో పండే రామఫలాల సేకరణ కష్టమే. ఎంతకాలం నిల్వ ఉండవు. మైదాన వ్యాపారులకు పండ్లను విక్రయిస్తున్నాం.

– ఎస్.తోటయ్య, గొయ్యిగూడ

పంట దిగుబడి బాగుంది



ఈ సీజన్‌లో పంట దిగుబడి బాగుంది. అంతగా పెట్టుబడులు అవసరం లేదు. సీజన్ ఆరంభంలో ధరలు బాగున్నాయి.

– ఎస్.బంగారయ్య, కొత్తగూడ



ఆలయ ముఖద్వారం

గోవిందుడి కల్యాణం చూతము రారండి..!

- ఫిబ్రవరి 20న తోటపల్లిలో నిర్వహణ
- ఉత్తరాంధ్రుల ఇలవేల్పు వేంకటేశ్వర స్వామి

గరుగుబిల్లి: ఉత్తరాంధ్ర ప్రాంతంలో చిన తిరుపతిగా పేరుగాంచిన తోటపల్లిలోని శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయం భక్తులకు కొంగు బంగారంగా నిలుస్తోంది. పవిత్ర నాగావళి నదీ తీరంలో వెలసిన ఐదు దశాబ్దాల చరిత్ర కలిగిన ఈ ఆలయంలో వేంకటేశ్వరస్వామి, పద్మావతి అమ్మవార్లను దర్శించుకునేందుకు పార్వతీపురం, విజయనగరం, విశాఖపట్నం, శ్రీకాకుళం తదితర జిల్లాలతోపాటు ఒడిశా రాష్ట్రం నుంచి వేలాది మంది భక్తులు నిత్యంవచ్చి తమ మొక్కులను తీర్చుకుంటారు.




పుట్టుదేవుడు (చెన్నకేశవస్వామి)

20న కల్యాణం

మాఘశుద్ధ ఏకాదశి సందర్భంగా ఫిబ్రవరి 20న మంగళవారం సాయంత్రం నాలుగు గంటల నుంచి తోటపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీ వేంకటేశ్వరస్వామి, పద్మావతి అమ్మవార్ల కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించనున్నారు. వీరఘట్టానికి చెందిన ప్రముఖయజ్ఞకర్త ఎస్‌వీఎల్ఎన్ శర్మయాజీ పర్యవేక్షణలో సత్తె నరసింహాచార్యులు, అప్పలాచార్యులు కల్యాణ మహోత్సవాన్ని వేదమంత్రోచ్చారణలతో జరిపిస్తారు. ఈ మేరకు కల్యాణానికి సంబంధించిన ఏర్పాట్లు దాదాపు పూర్తయ్యాయి. కల్యాణ మహోత్సవం అనంతరంఫిబ్రవరి 24న పవిత్ర నాగావళినదిలో స్వామి వారికి శ్రీమూర్త్యోత్సవం శ్రీచక్ర తీర్థ స్నానం నిర్వహించడం వివాహ వేడుక పూర్తి చేస్తారు. స్వామివారి కల్యాణంలో పాల్గొనే భక్తులు రూ. 500 చెల్లించి తమ గోత్రనా మాలతో పూజలు చేయించుకోవాలని కమిటీ సభ్యులు కోరుతున్నారు. కల్యాణ ఉత్సవాలలో భాగంగా కుసుమూరు సాగర్ ఆధ్వర్యంలో శ్రీ లీలా పార్వతి నాదస్వరం పార్టీతో దక్షిణాది సన్నాయి బృందం నాదస్వరం కచేరీ నిర్వహించనున్నారు. భక్తులు, దాతల సహకారాలతో నిర్వహించే ఈ కల్యాణంలో భక్తులు అధికంగా పాల్గొనాలని ఈఓ సూర్యనారాయణ కోరుతున్నారు.

ఆలయ చరిత్ర



కల్యాణంలో స్వామివారి ఉత్సవమూర్తులు

పార్వతీపురం–శ్రీకాకుళం ప్రధాన రహదారి పరిధిలో గల తోటపల్లివద్ద 1969లో జరిగిన రోడ్డుప్రమాదంలో ఓ ప్రైవేట్ బస్సులోయలో పడింది. ఆ బస్సును వెలికితీసే ప్రయత్నంలో పొదలు, డొంకలు, చెట్లు తొలగిస్తుండగా రెండున్నర అడుగుల శ్రీ చెన్నకేశవ స్వామి శిలావిగ్రహం బయటపడింది. ఈ నేపథ్యంలో స్థానికులు విగ్రహానికి గుర్తించి తాత్కాలికంగా కొమ్మలతో పందిరి ఏర్పాటు చేసి అందులో విగ్రహాన్ని ఉంచి పూజలు చేశారు. అక్కడే చందాలకోసం ఒక హుండీని ఏర్పాటుచేసి భక్తులనుంచి విరాళాలను సేకరించారు. రానురాను భక్తుల విరాళాలు ఎక్కువకావడంతో ఆలయనిర్మాణానికి ఆలోచన చేశారు. దీనికోసం అప్పటి పార్లమెంటుసభ్యుడు విశ్వాసరాయ నరసింహారావు "మేలుకొలుపు" అనే కరపత్రాన్ని ప్రచురించి వీరఘట్టానికి చెందిన డాక్టర్ నల్లాన సాంబశివరావు అధ్యక్షతన 40మంది సభ్యులతో ఒక కమిటీని ఏర్పాటు చేశారు. ఆలయనిర్మాణానికి తోటపల్లి గ్రామానికి చెందిన మార్కొండ కుటుంబీకులు స్థలాన్ని ఉచితంగా ఇవ్వగా పలువురు దాతలు ముందుకువచ్చి విరాళాలు అందజేశారు. దీంతో ఆగమశాస్త్రం ప్రకారం తోటపల్లిలోని నాగావళినది ఒడ్డున శ్రీవేంకటేశ్వరస్వామి, పద్మావతి అమ్మవార్ల ఆలయాలను నిర్మించారు. రోడ్డు ప్రమాదంలో లభించిన శ్రీచెన్నకేశవ స్వామి విగ్రహానికి పలుచోట్ల గాట్లు ఏర్పడడంతో ఆ విగ్రహమే నేడు పుట్టుదేవుడిగా భక్తులనుంచి పూజలు అందుకుంటోంది. విజయవాడలోని శిల్పశాలనుంచి పద్మావతి, వేంకటేశ్వరస్వామి విగ్రహాలను తెప్పించి 1972లో ప్రతిష్ఠ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.

క్లుప్తంగా

పరీక్ష కేంద్రాల పరిశీలన

ఎచ్చెర్ల క్యాంపస్: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్‌-2 స్క్రీనింగ్ పరీక్ష ఈ నెల 25న నిర్వహించనుంది. ఉదయం 10.30 నుంచి 1గంటవరకు పరీక్షలు నిర్వహించనున్నారు. ఎచ్చెర్లలోని శ్రీ వెంకటేశ్వర పాలిటెక్నిక్ కళాశాల, చిలకపాలెంలోని శ్రీ శివానీ పాలిటెక్నిక్ కాలేజ్‌లు శుక్రవారం ఇన్‌చార్జి ఎంపీడీఓ పీవీఎస్ రామ్మోహన్, ఈఓపీఆర్డీ కణితి ఈశ్వరి పరిశీలించారు. నిబంధనల మేరకు పరీక్ష కేంద్రాల్లో పూర్తిస్థాయి ఏర్పాట్లు చేస్తున్నట్లు వీరు తెలిపారు.

కూర్మనాథుని సన్నిధిలో దేవదాయ శాఖ ఆర్‌జేసీ

గార: శ్రీకూర్మం కూర్మనాథుడిని దేవదాయ ధర్మదాయ శాఖ ఆర్‌జేసీ కె.విజయరాజ్ శుక్రవారం ఉదయం దర్శించుకున్నారు. ముందుగా ఆలయ అధికారులు, అర్చకులు స్వాగతం పలికి మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు చేయించారు. క్షేత్ర మహత్యాన్ని ఆలయ ప్రధానార్చకులు చామర్తి సీతారామనృసింహాచార్యులు తెలియజేశారు. ఆయనతో పాటు దేవదాయ శాఖ పీఎస్ సురేష్, ఈఓ గురునాథం పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

పోలాకి: మండలంలోని బెలమర జంక్షన్ వద్ద గురువారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో బెలమర గ్రామానికి చెందిన మద్దు పురుషోత్తమ రావు(30) అనే యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. రాత్రి సమయంలో పిన్నింటిపేట నుంచి బెలమర వైపు స్కూటీపై వస్తూ అదుపు తప్పి అతివేగంగా ఎదురుగా ఉన్న గోడను ఢీకొట్టాడు. దీంతో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే 108 వాహనంలో చికిత్స కోసం నరసన్నపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ ఆదినారాయణ తెలిపారు. మృతుడికి భార్య, రెండేళ్ల కుమార్తె ఉన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి..

ఆమదాలవలస: ఆమదాలవలస పట్టణంలో గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆమదాలవలస మున్సిపాలిటీ మన్నయ్యపేట గ్రామానికి చెందిన జాడ దుర్గారావు(47) అనే వ్యక్తి గాయపడ్డారు. ఆయన ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మరణించినట్లు స్థానిక పోలీసులు తెలిపారు. రైల్వే అండర్ టన్నెల్ వద్ద ఎదురెదురుగా ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ప్రమాదంలో గాయపడిన దుర్గారావును 108 సిబ్బంది జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తరలించారు. ఆయన భార్య సూర్యరత్నం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే ఆయన శుక్రవారం ఆస్పత్రిలో మృతి చెందారు.

కిడ్నీ వ్యాధితో మహిళా సంఘం నాయకురాలు..

పలాస: పలాస మండలం నీలావతి గ్రామానికి చెందిన ప్రగతి శీల మహిళా సంఘం నాయకురాలు జుత్తు నీలవేణి కిడ్నీ వ్యాధితో మృతి చెందారు. ఆమె మృతికి సంతాప సూచికంగా ఉద్దానం ప్రాంతం నలుమూలల నుంచి విప్లవ శ్రేణులు హాజరై ఘనంగా నివాళులర్పించారు.

పిట్ట చంద్రపతి మృతిపై సంతాపం

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా సుదీర్ఘకాలం పనిచేసి బీసీల హక్కుల కోసం అనేక ఉద్యమాలు చేసిన పిట్ట చంద్రపతిరావు మృతిపై పలువురు సంతాపం వ్యక్తం చేశారు. ఆయన శుక్రవారం గుండెపోటుతో మరణించారు. ఆయన సొంతూరు కొత్తూరు మండలం బలద గ్రామం. ఆయన విద్యుత్ శాఖలో ఉద్యోగం చేసి రిటైరయ్యారు. జ్యోతిరావుపూలే పార్కు నిర్మాణానికి కృషి చేయడమే కాకుండా అక్కడ బహుజన నాయకుల విగ్రహాలు కూడా ఏర్పాటు చేశారు. పార్లమెంట్ సభల్లో బీసీల సమస్యలను లేవనెత్తానికి ఎంపీలకు అనేకమార్లు లేఖలు రాశారు. జిల్లా కేంద్రంలోని కంపోస్టుకాలనీలో వెనుకబడిన కులాల సామాజిక భవనాల నిర్మాణాలకు ఆయన కృషి చేశారు. ఆయన మృతిపై బీసీ సంఘ నాయకులు గంజి ఆర్ ఎజ్రా, ఎంఏ భేగ్, కర్రి రంగాజీదేవ్, గద్దిబోయిన కృష్ణయాదవ్, శ్రీశయన కార్పొరేషన్ చైర్మన్ డీపీ దేవ్, పిట్ట భాగ్యచంద్రరావు, తైక్వాండో శ్రీను, కంఠ వేణు, బుడుమూరు రాజేష్, బాడాన దేవభూషణరావు, వాన కృష్ణచంద్, సురేంద్ర, యజ్జల గురుమూర్తి, సురంగి మోహనరావు, బాలిన ప్రసాద్ జిల్లాలో అన్ని మండలాల నుంచి బీసీ సంఘ నేతలు పాల్గొన్నారు. పిట్ట చంద్రపతి రావు మృతిపై రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. ఆయన మృతి బీసీ లోకానికి తీరని లోటన్నారు. ఆయన కుటుంబానికి అండగా ఉంటామని ధైర్యంగా ఉండాలని కోరారు.

బాల్య వివాహాలతో అనర్థాలు

కొత్తూరు: బాల్య వివాహాలు చేయడం వల్ల అనర్థాలు ఎదుర్కోనాల్సి వస్తుందని బెడ్స్ స్వచ్ఛంద సంస్థ కో ఆర్డినేటర్ జి.జగన్నాథం అన్నారు. మండలంలోని కుంటిభద్ర గ్రామ సచివాలయంలో సర్పంచ్ పావని అధ్యక్షతన బాల్య వివాహాల చట్టంపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని తెలిపారు. బాలిక వయస్సు 18 ఏళ్లు నిండినప్పుడు మాత్రమే వివాహాలు చేయాలన్నారు. బాల్య వివాహాల నిషేధిత పరివేక్షణ కమిటీ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. బ్రెడ్స్ స్వచ్ఛంద సంస్థ కైలాష్ సత్యార్థి చిల్డ్రన్ ఫౌండేషన్ సంయుక్తంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పంచాయతీ కార్యదర్శి ఆర్‌కే భట్టుతో పాటు పలువురు గ్రామ సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

దినకరా...శుభకరా..!

రథ సప్తమి సందర్భంగా శుక్రవారం ఆలయాలు, సాగర తీరాలు భక్తులతో కళకళాలాడాయి. వేకువ జామునే సముద్రపు ఒడ్డుకు చేరుకున్న ప్రజలు ఇసుక తిన్నెలపై పాయసం వండి సూర్యదేవునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సూర్యోదయ సమయాన సూర్య నమస్కారాలతో అభ్యంగన స్నానమాచరించారు. – సాక్షి నెట్‌వర్క్


రాయగడ: జగన్నాథ మందిర ప్రాంగణంలో బారులు తీరిన భక్తులు


బరంపురం: సముద్ర స్నానాలు ఆచరిస్తున్న ప్రజలు


రాయగడ: పూజలందుకుంటున్న సూర్యనారాయణస్వామి


పర్లాకిమిడి: ఉమారామలింగేశ్వర మందిరంలో ప్రత్యేక పూజలు


బరంపురం: పూజల్లో పాల్గొన్న ప్రజలు


రాయగడ: సూర్యనారాయణస్వామి వారి ఊరేగింపు


జయపురం: నెహ్రూ నగర్‌లో సామూహిక పూజలు నిర్వహిస్తున్న మహిళలు


పర్లాకిమిడి: సూర్య దేవునికి క్షీరాన్నం వండుతున్న మహిళలు

తపాలా ఉద్యోగుల ఆందోళన


ప్రధాన తపాలా కార్యాలయం వద్ద నిరసన తెలియజేస్తున్న తపాలా ఉద్యోగులు

శ్రీకాకుళం అర్బన్: తపాలా ఉద్యోగులకు 8వ వేతన సవరణ వెంటనే అమలు చేయాలని తపాలా ఉద్యోగుల సంఘం ప్రతినిధులు డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య పిలుపు మేరకు శుక్రవారం శ్రీకాకుళంలోని ప్రధాన తపాలా కార్యాల యం వద్ద తపాలా ఉద్యోగులు నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్‌పీఎస్ రద్దు చేసి ఓపీఎస్ తిరిగి అమలు చేయాలని, ఎన్‌ఎఫ్‌పీఈ/ఏఐపీఈయూ గ్రేడ్-సి సంఘాల గుర్తింపును తిరిగి పునరుద్ధరించాలని, కమలేష్‌చంద్ర కమిటీ సానుకూల సిఫార్సులను వెంటనే అమలు చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని, నిలిపివేసిన 18 నెలల కరువుభత్యం బకాయిలను విడుదల చేయాలని, ప్రభుత్వరంగ సంస్థల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం సమ్మె చేసిన జీడీఎస్ ఉద్యోగులపై వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా పోస్టల్ ఉద్యోగ సంగాల నాయకులు యూవీ రమణ, గణపతి, బాబూరావు, గురన్న, రామకోటి, రమేష్‌పాత్రో, సురేష్, సూరిబాబు, పోస్టల్ పెన్షనర్స్ సంఘ నాయకులు చంద్రశేఖర్, జ్యోతీశ్వరరావు, వెంకటరావు, త్రినాద్, సూర్యనారాయణ, రమణ తదితరులు ఉన్నారు.

ప్రభాత సూర్యునికి ప్రణామం

- నిజరూప దర్శనం చేసుకుని పులకించిన భక్తజనం
- క్షీరాదిత్యుడిని దర్శించుకున్న మంత్రి ధర్మాన, పలువురు ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు




క్షీరధారల తెరలు తొలిగాక అరుదైన అరుణ శిల సాక్షాత్కరించింది. ఏడేడు లోకాలకు వెలుగునిచ్చే సూరీడి నిజరూపం అపురూపమై గోచరించింది. ఆభరణాల అడ్డు లేకుండా ఆదిత్యుని మూర్తిని తిలకించి భక్తజనం పులకించింది. క్షీరాన్న సువాసనలతో ఆలయ ఆవరణ గుభాళించింది. సూర్య జయంతి నాడు అరసవల్లి తన పాత రూపాన్ని ధరించింది. వేవేల భక్తులను సాదరంగా ఆహ్వానించి స్వామిని చూపించింది.



అరసవల్లి, శ్రీకాకుళం క్రైం, శ్రీకాకుళం, శ్రీకాకుళం కల్చరల్:

అరసవల్లిలో అపురూపమైన నిజరూప దర్శనానికి భక్తులు పోటెత్తారు. సూర్య జయంతి సందర్భంగా శుక్రవారం వేలాది మంది ఆదిత్య క్షేత్రానికి విచ్చేశారు. రథసప్తమి సందర్భంగా గురువారం అర్ధరాత్రి 12.20 గంటలకు సప్తమి ముహూర్తాన ప్రారంభమైన క్షీరాభిషేకం శుక్రవారం ఉదయం 7 గంటల వరకు ఘనంగా జరిగింది. అనంతరం సాయంత్రం 4 గంటల వరకు నిజరూప దర్శనం ఉండడంతో భక్తులు పోటెత్తారు. ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా పంచామృతాలతో స్వామికి అభిషేకం చేశారు. క్షీరాభిషేక సేవలో పాల్గొన్న భక్తుల గోత్ర నామాలతో అభిషేకాలు జరిపించారు. స్వామి నిజరూప దర్శనానికి వచ్చిన ప్రజాప్రతినిధులను, ప్రముఖులను, ఉన్నతాధికారులను ఆలయ ఈఓ రమేష్‌బాబు, అసిస్టెంట్ కమిషనర్ వి.హరిసూర్య ప్రకాష్‌లు గౌరవ స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు.


ప్రత్యక్షదైవమైన సూర్యదేవునికి నమస్కరిస్తున్న భక్తులు


క్యూలో భక్తులు (ఇన్‌సెట్లో) సూర్యదేవునికి నమస్కారం చేస్తున్న భక్తులు

ఫలించిన టైమ్ స్లాట్ సిస్టం



స్వామి దర్శనానికి పక్కాగా క్యూలైన్లను ఏర్పాటు చేసిన దేవదాయ శాఖాధికారులు, తొలిసారిగా అమలు చేసిన టైమ్ స్లాట్ సిస్టం ఫలించింది. బొంపాడ వీధి కూడలి వద్ద నుంచి మొదలైన దాతల పాసుల లైన్‌కు అర్ధరాత్రి 12.30 గంటల నుంచి ఉదయం 7 గంటల వరకు స్లాట్ విధించారు. అలాగే ఇదే క్యూలైన్లలో ఉదయం 7 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు నాలుగు స్లాట్‌లుగా వీఐపీ పాసులను అనుమతించిన విధానంతో భక్తులు సంతృప్తి వ్యక్తం చేశారు. స్వచ్ఛంద సేవల్లో భాగంగా మంచినీరు, మజ్జిగ, ప్రసాదాలు, పులిహోర, అన్నప్రసాదంతో పాటు వైద్య సేవలు కూడా భక్తులకు అందుబాటులోకి రావడంతో భక్తులు సంతృప్తి వ్యక్తం చేశారు.

భారీ బందోబస్తు.. అయినా



బందోబస్తు విషయంలో పోలీసులు భారీగానే ఏర్పాట్లు చేశారు. అయితే తొలి అభిషేక సేవ సమయంలో ధ్వజస్తంభ మండపం వద్ద పోలీసులు పాలక మండలి సభ్యులను అడ్డుకున్నారు. స్వామీజితో పాటు పట్టువస్త్రాలు, ప్రసాదాలను పట్టుకున్న పాలకమండలి సభ్యులను సైతం ఆలయం లోపలికి విడిచిపెట్టలేదు. దీంతో పాలకమండలి సభ్యులు మండవల్లి రవి, జలగడుగుల శ్రీనివాస్, దుక్క గనిరాజు, మైలపల్లి లక్ష్మి, జోగి మల్లెమ్మలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వ విప్ పాలవలస విక్రాంత్ కూడా అసహనం వ్యక్తం చేశారు. పాలకొండ ఎమ్మెల్యే కళావతితో పాటు శారదాపీఠం ఉత్తరాధికారి శ్రీస్వాత్మానంద సరస్వతి అనుచరులు కూడా సింహద్వారం, 80 ఫీట్ రోడ్డు కూడలి వద్ద కొందరు పోలీసులపై అసంతృప్తి వ్యక్తం చేశారు. అయితే తర్వాత మాత్రం పూర్తిగా భిన్నమైన పరిస్థితులు కనిపించాయి. టెక్కలి డీఎస్పీ ఆధ్వర్యంలో పరిస్థితి పూర్తిగా అదుపులోకి వచ్చేసింది. సీసీ కెమెరాలతో పటిష్ఠ బందోబస్తు నిర్వహించారు.

సంప్రదాయబద్ధంగా..


ఇంద్ర పుష్కరిణి వద్ద సూర్యదేవునికి ఇష్టమైన నైవేద్యం చేస్తున్న భక్తులు

రథసప్తమి సందర్భంగా సూర్యోదయ సమయంలో సూర్యునికి ఎదురుగా ఆవు పిడకల పొయ్యిపై ఆవుపాలు, కొత్త బియ్యం, కొత్త బెల్లంతో క్షీరాన్నం వండి, తర్వాత చిక్కుడు కాయలతో రథం తయారుచేసి, ఆదిత్యుని చిత్రపటం పెట్టి, స్వామికి క్షీరాన్నాన్ని నివేదన సమర్పించారు. ఈ పరిసరాలన్నీ పిడకల పొగతో, పాల పొంగు వాసనలతో నిండిపోయింది.



200 మంది రక్తదానం

రథసప్తమి సందర్భంగా ధర్మశాస్త్ర ట్రస్టు ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. ఆలయానికి దర్శనానికి వచ్చిన భక్తుల్లో సుమారు 200 మంది వరకు రక్తదానం చేశారు. స్వచ్ఛంద సేవలకు డాక్టర్ మంత్రి వెంకటస్వామి భక్తులకు రక్తదానంపై అవగాహన కల్పించారు.


స్వామిని దర్శించుకునేందుకు వచ్చిన వికలాంగులు, వృద్ధులు

